ఎన్నికలకు సర్వం సిద్ధం

- నియోజకవర్గంలో 306 పోలింగ్ కేంద్రాలు, 35 సెక్టార్లు, 2774 మంది సిబ్బంది
- ఈవీఎంల పంపిణీని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

బోథ్: పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఎన్నికల నిర్వహణ కోసం అధికారిక బలగం పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లింది. ఇక ఓటర్లు సోమవారం తమ ఓటును వేయడానికి ఇంటి నుంచి కదిలి పోలింగ్ కేంద్రాలకు రావాల్సి ఉంది. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని బోథ్ నియోజకవర్గంలో పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం బోథ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఖుష్బూ గుప్తా ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈవీఎంల పంపిణీని చేపట్టారు. మొత్తం 35 టేబుళ్లలో ఈవీఎంలతో పాటు పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. నియోజకవర్గంలో మొత్తం 306 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 35 సెక్టార్లు ఉండగా, 35 రూట్లలో ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న 2774 మంది సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు పంపించారు. దీనికోసం 19 ఆర్టీసీ బస్సులు, 143 అద్దె ఆర్టీసీ బస్సులు, 40 జీపులు, 44 మినీ బస్సులను ఏర్పాటు చేశారు. వర్షం కురిస్తే పోలింగ్ సామగ్రి తడవకుండా కవర్లను అందజేశారు. నియోజకర్గ వ్యాప్తంగా 500 మంది పోలీసు, సీఆర్‌పీఎఫ్, ఫారెస్టు సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. 20 శాతం సిబ్బందిని రిజర్వ్ చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఖుష్బూ గుప్తా తెలిపారు. ఈవీఎంలు మొరాయిస్తే 20 శాతం అదనంగా సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలలోపు ఈవీఎంల పంపిణీ పూర్తి చేశారు. పరిశీలకులు రాజేంద్ర విజయ్, కలెక్టర్ రాజార్షి షా పంపిణీ తీరును పరిశీలించారు.

నిర్భయంగా ఓటు వేయండి: ఖుష్బూ గుప్తా, ఏఆర్వో

ప్రతిఒక్కరూ ఓటుహక్కు నిర్భయంగా వినియోగించుకోవాలి. పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయండి. ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాం. ఉదయం నుండే పోలింగ్ ప్రారంభమవుతుంది. ఎండ తీవ్రత కారణంగా పోలింగ్ కేంద్రాల వద్ద నీటి వసతిని కల్పించాం.


ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షి షా

ఆదిలాబాద్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బంది ఆదివారం సాయంత్రం మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలో గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో 48 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. పార్లమెంట్ ఎన్నికలలో రెండు పోలింగ్ కేంద్రాలు పెరగడంతో పోలింగ్ కేంద్రాల సంఖ్య 50కి చేరుకుంది. మండలంలోని తంతోలిలో రెండు, చాందా (టి)లో మూడు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. మండలంలోని యాపల్‌గూడ, అంకోలిలో మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మావల మండలంలో 41 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం మండలంలో 8 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉండగా ఇందులో కేఆర్కే కాలనీలో 6, మావలలో రెండు ఉన్నాయి. ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు అధికారులు చేరుకున్నారు. ఇంద్రవెల్లిలో నాలుగు రూట్‌లు 42 పోలింగ్ కేంద్రాలుండగా.. ప్రత్యేకంగా కేటాయించిన వాహనాల్లో చేరుకున్నారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో భద్రత ఏర్పాట్లు చేశారు. ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని డీఎస్పీ కోరారు.

సిరికొండ: పార్లమెంట్ ఎన్నికలకు మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లు సిద్ధమయ్యాయి. పోలింగ్ కేంద్రాలు అన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం ఎన్నికల సామగ్రితో సిబ్బంది వారి పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టారు.


ఈవీఎంలు తీసుకువెళ్తున్న సిబ్బంది


ఇంద్రవెల్లి: పోలింగ్ కేంద్రానికి చేరిన అధికారులు

నేరడిగొండ: మండలంలోని 32 గ్రామ పంచాయతీల పరిధిలో ఓటర్లు 23,550 మంది ఉన్నారు. సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆయా గ్రామాల్లో 36 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొత్తగా చించోలి, సవర్గాం రోడ్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కుమారి, తేజాపూర్ గ్రామాల్లో మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం ఐదు రూట్లుగా ఏర్పాటు చేసి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు.

బస్సు వివరాల విచారణకు ప్రత్యేక నంబర్లు

ఎదులాపురం: ప్రయాణికుల సౌకర్యార్థం టీఎస్ ఆర్టీసీ బస్సుల వివరాలు తెలుసుకునేందుకు ప్రత్యేకంగా విచారణ సెల్ నెంబర్లను ఏర్పాటు చేసింది. ఆదిలాబాద్ డిపో విచారణ నంబర్ 83310 33707, ఉట్నూర్ 73828 40047 ఏర్పాటు చేసింది. ప్రయాణికులు ఫోన్ చేసి బస్సుల వివరాలు తెలుసుకోవచ్చని డిపో మేనేజర్ కల్పన తెలిపారు.

చిన్నారులకు బిస్కెట్లు పంపిణీ

కైలాస్‌నగర్: మదర్స్‌డేను పురస్కరించుకుని హ్యాండీక్యాప్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేదలైన చిన్నారులకు బిస్కెట్, చిప్స్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక న్యూహౌజింగ్ బోర్డు వెళ్లే మార్గంలోని సంచార జీవులైన చిన్నారులకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మహమ్మద్ ఇమ్రాన్, ప్రధాన కార్యదర్శి ఫైసల్ అహ్మద్, సయ్యద్ సాజిద్ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. రాజకీయ నాయకుల ప్రలోభాలకు లొంగకుండా, నచ్చిన నాయకుడి కోసం మీ విలువైన ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుశీల, మెస్రం లక్ష్మణ్, ఆయా గ్రామపంచాయతీల అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం


ఎంపీపీని సన్మానిస్తున్న కమిటీసభ్యులు

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలోని పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. భక్తులు, గ్రామస్తులు కల్యాణ మహోత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చేతిపంపునకు మరమ్మతులు


చేతిపంపు రిపేర్ చేయిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం హమాలివాడలోని గంగపుత్ర కాలనీలో చేతిపంపు చెడిపోవడంతో నీటి సమస్య ఏర్పడింది. ఈ విషయాన్ని కాలనీవాసులు ఆదిలాబాద్ పట్టణ తాగునీటి ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన బల్దియా అధికారులతో మాట్లాడి యుద్ధప్రతిపాదికన చేతిపంపునకు మరమ్మతులు చేయించి, సమస్యను పరిష్కరించారు.

పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండలంలోని గిమ్మ గ్రామానికి చెందిన ఐదుగురిపై ఆదివారం పిడుగుపడి తీవ్ర గాయపడగా.. వారిని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా.. అక్కడికి చేరుకొని బాధితులను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న రిమ్స్‌కు వెళ్లి బాధితులను పరామర్శించారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

ఇంద్రవెల్లి: అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని సమాక గ్రామంలో జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సమాక గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సోయం రభబాయి(40) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చికిత్స అందించినా.. ఆరోగ్యం కుదుటపడలేదు. ఆరోగ్య పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు.

నేడు పట్టణంలో 144 సెక్షన్

భైంసాటౌన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో సోమవారం 144 సెక్షన్ అమలులో ఉంటుందని పట్టణ సీఐ డి. రాజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. సోమవారం వారసంత రద్దు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. పట్టణవాసులు, పరిసర ప్రాంత ప్రజలు గమనించాలని సూచించారు.

రైతులకు ఇబ్బంది కలుగనీయొద్దు


ధాన్యం కొనుగోలు పరిశీలిస్తున్న మాజీ ఎంపీ

కడెం: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నబెల్లాల్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా రైతుల సమస్యలను తెలుసుకున్నారు. అకాల వర్షాలు ఉన్నందున ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. తప్ప, తాలు పేరిట కోతలు విధిస్తే రైతులకు మద్దతుగా ఆందోళన చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్, జక్కుల సత్తెన్న, తోట రాజేశ్, వెంకటేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆపరేటర్లపై పని భారం

- పెరిగిన విద్యుత్ సబ్‌స్టేషన్లు
- మంజూరు కాని ఆపరేటర్ పోస్టులు

బేల: విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నుంచి నిరంతర విద్యుత్ సరఫరా కోసం పనిచేసే ఆపరేటర్లు అవస్థలు పడుతున్నారు. నూతన సబ్‌స్టేషన్లు పెరగడంతో పాటు పనిభారం సైతం పెరిగింది. అయినా.. కొత్తగా ఆపరేటర్ పోస్టులు మంజూరు కావడం లేదు. ఈక్రమంలో సబ్‌స్టేషన్‌లలో ఆపరేటర్ పోస్టులు సర్దుబాటు మాత్రమే జరిగింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్‌శాఖ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. జిల్లా విద్యుత్ శాఖ పరిధిలోని ఆదిలాబాద్ డివిజన్ పరిధిలోని ఆదిలాబాద్ రూరల్, ఆదిలాబాద్ అర్బన్, మావల, జైనథ్, బేల, తాంసి, తలమడుగు, భీంపూర్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, బోథ్, నేరడిగొండ మండలాల్లో మొత్తంగా 36 సబ్‌స్టేషన్లు ఉన్నాయి.

నూతన సబ్‌స్టేషన్లకు సర్దుబాటు..

ప్రతీ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్ విద్యుత్ సరఫరాలో అంతరాయం, ఎల్‌సీలు, ఇన్‌కమింగ్‌లలో ప్రతినిత్యం అప్రమత్తంగా ఉండడంతో పాటు తదితర వివరాలను లాగ్‌బుక్‌లో రాయాలి. గతంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ సరఫరా నిర్వహణ కోసం ఒక్కొక్క సబ్‌స్టేషన్‌లో నలుగురు ఆపరేటర్‌లు, ఒక వాచ్‌మెన్ ఉండేవారు. ప్రతీరోజు ముగ్గురు ఆపరేటర్‌లకు ఒక్కొక్కరికి 8గంటల చొప్పున విధులు కేటాయించేవారు. దీంతో పాటు అదనంగా ప్రత్యామ్నయంగా మరో ఆపరేటర్ అందుబాటులో ఉండగా.. రాత్రివేళ ఒక వాచ్‌మెన్ సైతం విధి నిర్వహణలో ఉండేవారు. పెరిగిన సబ్‌స్టేషన్లకు అనుగుణంగా కొత్తగా ఆపరేటర్‌ల పోస్టులు మంజూరు కాలేదు. దీంతో ఒక్కొక్క సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌ల సంఖ్య 4 నుంచి 2 కు తగ్గింది. నూతన సబ్‌స్టేషన్లకు వారిని సర్దుబాటు చేశారు. వాచ్‌మెన్ పోస్టు పూర్తిస్థాయిలో లేకుండా పోయింది. ఒక్కొక్క సబ్‌స్టేషన్‌లో కేవలం ఇద్దరు చొప్పున ఆపరేటర్‌లు రోజుకి ఒకరు చొప్పున విధులు నిర్వర్తిస్తున్నారు. మొత్తానికి 24 గంటల పాటు నిరంతరం విధుల నిర్వహణ చేయక తప్పడం లేదు. ఏమైనా అనారోగ్యం బారిన పడితే అత్యవసర వేళ ఆ ఇద్దరు ఆపరేటర్‌లే సర్దుబాటు చేసుకోవాల్సిన పరిస్థితి. ఎటువంటి సెలవులకు అవకాశం లేకపోగా.. తప్పనిసరి పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తూ.. మానసిక క్షోభకు గురవుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా.. ఎలాంటి ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి ఆపరేటర్ పోస్టులు మంజూరు చేయాలని కోరుతున్నారు.


బేలలోని విద్యుత్ సబ్‌స్టేషన్

రోడ్డుపైనే జొన్న కుప్పలు


తాంసి మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డులో వారం రోజులుగా జొన్నల కొనుగోలు చేపడుతున్నారు. మార్కెట్‌యార్డులో రైతులు విక్రయానికి తీసుకువచ్చిన పంట నిల్వ చేసేందుకు సరైన స్థలం లేక అవస్థలు పడుతున్నారు. దీంతో రైతులు రోడ్డుపై కుప్పలు పోసి విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెటింగ్ అధికారులు స్పందించి మార్కెట్ స్థలాన్ని విస్తరించాలని రైతులు కోరుతున్నారు. – తాంసి

'గెలుపు మనదే'

నేరడిగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుస్తున్నామని, గెలుపు మనదేనని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం నేరడిగొండ మండలంలోని రేంగన్‌వాడి, ఇస్పూర్ గ్రామాల ఆదివాసీ పటేళ్లు, మహిళలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. మాయమాటలు చెప్పి కాంగ్రెస్ గద్దెనెక్కిందని, ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ చెప్పే మాటలకు ప్రజలు మోసపోవద్దన్నారు. ఎంపీగా గెలిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి ఆత్రం సక్కును గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో బోథ్, నేరడిగొండ ఎంపీపీలు తుల శ్రీనివాస్, రాథోడ్ సజన్, అల్లూరి శివారెడ్డి, అంబేకర్ పండరి, రవీందర్ రెడ్డి, ఉప్పు పోశెట్టి, ఆదుముళ్ల భూషణ్, సుజీల్, గులాబ్ సింగ్, ఆడెపు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆత్రం సక్కు


ఇందూర్‌పల్లి వద్ద రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్టు

భీంపూర్‌లో గాలివాన బీభత్సం

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. భీంపూర్ మండలంలోని అంతర్గాం, అర్లి(టి), వడూర్, తాంసి(కె), పిప్పల్‌కోటి, కరంజి, ధనోర, గోన, భీంపూర్‌తో పాటు తాంసి మండలంలోని కప్పర్ల, జామిడి, గిరిగాం, సావర్గాం గ్రామాల్లో వర్షం కురిసింది. ఇందూర్‌పల్లి గ్రామం వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్లు విరిగిపడ్డాయి. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అర్లి(టి) గ్రామానికి చెందిన అశోక్ ఇల్లు గాలివానకు కూలిపోయింది. చేతికి వచ్చిన జొన్న, నువ్వు పంట సైతం వర్షానికి తడిసిపోవడంతో రైతులకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


అర్లి(టి)లో కూలిన ఇల్లు

అడెల్లిలో భక్తుల సందడి


దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. అమ్మవారి దర్శనం కోసం జిల్లా నలుమూలల నుంచే కాక మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు ఏర్పడకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే అమ్మవారి దర్శన ప్రవేశం కల్పించారు.

మార్కండేయస్వామి ఆలయ వార్షికోత్సవం


ముస్తాబైన ఆలయం


పల్లకి సేవలో భక్తులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని మార్కండేయ స్వామి ఆలయ రెండో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం పుణ్యాహవచనం, అంకురార్పణం, గణపతి పూజ, అవాహిత దేవత హోమం వంటి కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం ఒంటి గంటకు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారి కల్యాణం వైభవంగా జరిపించారు. అనంతరం పల్లకిసేవ నిర్వహించి సాయంత్రం ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఊరేగించారు. స్థానిక పద్మశాలి సంఘం సభ్యులతోపాటు వివిధ ప్రాంతాల వారు వచ్చి పూజలు చేశారు. ఎంపీపీ అద్వాల పద్మ, జెడ్పీటీసీ రాజేశ్వర్, భూపాల్‌రెడ్డి, ముత్యం రెడ్డి, బిట్లింగ్ నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్ పూజలు నిర్వహించారు.

వాహనాలు తనిఖీ

నర్సాపూర్ (జి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు సరఫరాను అరికట్టేందుకు మండల కేంద్రంలోని 61వ జాతీయ రహదారిపై ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై హన్మాండ్లు మాట్లాడుతూ అక్రమంగా డబ్బు, మద్యం తరలిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు మహేందర్, చౌహాన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు చీటీల పంపిణీ

ఖానాపూర్: పట్టణంలోని పలు కాలనీల్లో ఆదివారం బీఎల్‌వోలు ఓటర్లకు పోల్ స్లిప్(ఓటరు చీటీ)లను పంపిణీ చేశారు. కొందరికీ చీటీలు రాకపోవడంతో అధికారులకు ఫోన్ చేసి విన్నవిస్తున్నారు. పూరిస్థాయిలో చీటీలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొంటున్నారు.